క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో దుర్గామాత అమ్మవారి పూజలు

హఫీజ్‌పేట్ : చందానగర్ డివిజన్ పరిధిలోని కెఎస్‌ఆర్ ఎన్‌క్లేవ్‌లో సర్వ సమాజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీ దుర్గామాత అమ్మవారి పూజ కార్యక్రమం ఆదివారం కన్నుల పండుగగా జరిగాయి. ఈ ప్రత్యేక పూజలకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ హాజరై పూజలు చేశారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు రఘునాథ్ రెడ్డి, నాయకులు ప్రవీణ్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న గణేశ్ చిత్రాల ఎగ్జిబిషన్

మాదాపూర్: మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో నిర్వహిస్తున్న గణేశ పెయింటింగ్ ఎగ్జిబిషన్ సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటుంది. ఈనెల 20వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ ప్రదర్శనలో 70 చిత్రాలు సందర్శకులకు అందుబాటులో ఉన్నాయి. వివిధ ఆకృతులలో గణేశ చిత్రాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి.

ఓటమి నుంచే విజయం

సాక్షి,సిటీబ్యూరో: ప్రతికూల ఫలితాలతో బెంబేలెత్తక పనిచేస్తేనే విజయం అనే సందేశాన్ని అందిస్తూ టెడెక్స్ హైదరాబాద్ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని ప్రధాన్ కన్వెన్షన్‌లో 'ఇగ్నైట్' థీమ్‌తో ఆదివారం నిర్వహించిన కార్యక్రమం ఆద్యంతం ఆకట్టుకుంది. విభిన్న రంగాలకు చెందిన విజయవంతమైన వ్యక్తులు ఈ కార్యక్రమంలో స్ఫూర్తిదాయక ప్రసంగాలు చేశారు. తమ ఆవిష్కరణ వ్యయప్రయాసలను మేళవించిన స్వీయ కథలతో ప్రేక్షకులలో ఆసక్తిని నింపారు. నగరానికి చెందిన కల్పనా రమేష్ మాట్లాడుతూ నీటి భద్రత కార్యాచరణను ఏర్పాటు చేయడం వెనుక తన కృషిని వివరించారు. నెక్రో ప్లస్ ఫౌండర్ కమల్ షా, స్కైరూట్ ఏరోస్పేస్ సహ-వ్యవస్థాపకుడు సీఈఓ పవన్ కుమార్, 'పల్లె సృజన' మిషన్ వ్యవస్థాపకులు బ్రిగేడియర్ పి గణేశం, అంధ కళాకారిణి ఐశ్వర్య పిళ్లై, బ్రిటీష్ కళాకారుడు కాట్ అలానో తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని స్థానిక క్యూరేటర్ వివేక్ వర్మ పర్యవేక్షించారు.

విద్యార్థులను ప్రోత్సహించేందుకే నగదు రివార్డులు

మాదాపూర్: విద్యార్థులలో దాగివున్న నైపుణ్యాలను వెలికితీసు ప్రోత్సహించడానికి నగదు రివార్డులను అందించాలని ఎమ్మెల్సీ వాణీదేవి పేర్కొన్నారు. మాదాపూర్‌లోని అవధాన సరస్వతీ పీఠంలో సెమ్స్ ఒలింపియాడ్ ఫౌండేషన్ 4వ నేషనల్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వాణీదేవీ మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే తమకు నచ్చిన అంశాలపై రాణించాలని కోరారు. దేశానికి ఉపయోగపడే పౌరులుగా తయారు కావాలని తెలిపారు.ఈ సందర్భంగా 2100 మంది విద్యార్థులకు నగదు, సర్టిఫికెట్‌లను అందజేశారు. సెమ్స్ ఒలంపియాడ్ కన్వీనర్ ఆరుకాల రామచంద్రారెె తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మట్టి వినాయక ప్రతిమలను ప్రతిష్ఠించి పర్యావరణాన్ని కాపాడాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం రామచంద్రాపురం, భారతినగర్ డివిజన్‌ల పరిధిలో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, జీహెచ్‌ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

పండగ వేళ.. సందడి చేసిన చిన్నారులు

- ఉత్సాహంగా మట్టి గణపతి విగ్రహాల తయారీ
- అపర్ణ సరోవర్‌లో పండుగ వాతావరణం



అపర్ణ సరోవర్‌లో మట్టి వినాయక ప్రతిమల తయారీలో చిన్నారులు, సరోవర్ వాసులు





అపర్ణ సరోవర్‌లో మట్టి వినాయకులతో చిన్నారులు

శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి నల్లగండ్లలోని అపర్ణ సరోవర్ వాసులు పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించారు. అందులో భాగంగా మట్టి వినాయక విగ్రహాలను తయారు చేశారు. అపర్ణ సరోవర్ గణేష్ ఉత్సవ సమితి, బాలగోకులం భారత్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టిన ఈ కార్యక్రమంలోస రోవర్ వాసులు ఒక్కసారిగా కదలడంతో పండుగ వాతారణం నెలకొంది. చిన్నారులు, పెద్దలు వందలాది మంది ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. బాలగోకులం పేరిట చేపట్టిన కార్యక్రమంలో చిన్నారులు మట్టి గణపతి విగ్రహాలను పెద్ద ఎత్తున తయారు చేశారు.

పర్యావరణ పరిరక్షణ కోసం...

రోజు రోజుకు పెరుగుతున్న వాతావరణ కాలుష్యాన్ని అరికట్టేందుకు పిల్లల్లో చిన్నాటి నుంచే సామాజిక అంశాలపై అవగాహన కల్పించడం కోసం అపర్ణ సరోవర్‌లో మట్టి వినాయక ప్రతిమల తయారు కార్యక్రమాన్ని 12వ ఏటా చేపట్టారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్, వివిధ రసాయనాలు, రంగులతో తయారు చేసిన విగ్రహాల వల్ల వాతావరణ, జల కాలుష్యం పెరుగుతున్నందున మట్టి వినాయకులనే పూజించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందని చిన్నారులు పేర్కొంటున్నారు. ఈ కార్యక్రమంలో అపర్ణ సరోవర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు నాగరాజు, శ్రీలక్ష్మీ, సాయిరాం, దీప తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణంపై అవగాహన

అపర్ణ సరోవర్‌లో మట్టి వినాయకులు తయారీతో గణేష్ ఉత్సవాలు ప్రారంభం అవుతాయి. చిన్నారుల్లో పర్యావరణంపై అవగాహన కల్పించడంతో పాటు సంస్కృతి సంప్రాయాలను తెలియజేసేందుకు దోహదపడుతుంది. ఏటా ఏటా మట్టి గణపతి విగ్రహాల ఏర్పాటుకు ముందుకు రావడం సంతోషం.

–నాగరాజు,
అపర్ణ సరోవర్ గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధి

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో బిహార్ కనెక్ట్ 2023 చేనేత , హస్తకళా మేళను ఆదివారం సెలవురోజు కావడంతో సందర్శకులు అధిక సంఖ్యలో సందర్శించారు. బిహార్ రాష్ట్రానికి చెందిన చెక్కబొమ్మలు, వెదురు బొమ్మలు, బుట్టలు, మధుబని, సిక్కి, ఆర్ట్, కేడి, ఎంబ్రాయిడరి, మస్లిన్, భవన్ బ్యూటి సారీ, నలంద లక్క బ్యాంగిల్స్, తస్సార్ సిల్క్ చేనేత, ఖాదీ ఉత్పత్తులు సందర్శకులకు అందుబాటులో ఉంచారు. సాంస్కృతిక కార్యక్రమాలలో బాగంగా సోనాలి మహంతి చే ఒడిస్సీ నృత్యప్రదర్శన సందర్శకులను ఆకట్టుకుంది. మృణాళిని శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శన అలరించింది. వినాయకస్తుతి, బ్రహ్మాంజలి, బృందావన నిలయే, రామాయణశబ్దం, తిల్లాన, జతిస్వరం, శివాష్టకం, బ్రహ్మాంజలి తదితర అంశాలను కళాకారులు ప్రదర్శించి అలరించారు.

తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు



శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయం ముందు..



మసీదుబండలో..

గచ్చిబౌలి/శేరిలింగంపల్లి/రాయదుర్గం: తెలంగాణ విమోచన దినోత్సవాన్ని వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి జంట సర్కిళ్ళ పరిధిలో పలు చోట్ల జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యంగా శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయం, సర్కిల్ కార్యాలయం ముందు జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ ఇతర అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజల వీరత్వానికి నిలయం: బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవికుమార్‌యాదవ్

తెలంగాణ రాష్ట్రం ప్రజల వీరత్వానికి నిలయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్ స్పష్టం చేశారు. మసీదుబండలో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాఘవేందర్‌రావు, ఎల్లేష్, ఆంజనేయులు పాల్గొన్నారు.

- ఎంఐజీకాలనీలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని జాతీయ పతాకావిష్కరణతో జరుపుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నందకుమార్‌యాదవ్,గోవర్ధన్‌గౌడ్, మహిపాల్ రెడ్డి, శాంతిభూషన్‌రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు
- టెలికామ్‌నగర్‌లో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రవీందర్‌రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

మట్టి వినాయకుల పంపిణీ



మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, తదితరులు

హఫీజ్‌పేట్ : వినాయక చవితి పండుగను పురస్కరించుకొని చందానగర్ డివిజన్ పరిధిలో మట్టి వినాయకులను స్థానిక కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ ఆదివారం పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి వినాయకులను పుజిద్దాం, పర్యావరణంను పరిరక్షిద్దామన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు, మాజీ కార్పొరేటర్లు, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాతృశ్రీనగర్‌లో...

వినాయకచవితిని పురస్కరించుకొని మాదాపూర్ డివిజన్ పరిధిలోని మాతృశ్రీనగర్‌లో వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను అధ్యక్షులు అనిల్ కావూరి, కన్నయ్య నాయుడు తదితరులు పంపిణి చేశారు.

మియాపూర్ : మియాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉచితంగా మట్టి వినాయక ప్రతిమలను కార్పొరేటర్లు ఉప్పలపాటి శ్రీకాంత్, దొడ్ల వెంకటేష్,నార్నె శ్రీనివాస్‌రావు, పూజిత జగదీశ్వర్, మంజుల రఘునాథ్‌రెడ్డి, రోజాదేవి, రంగారావు, మాజీ కార్పొరేటర్ సాయిబాబాలతో కలిసి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పంపిణీ చేశారు.

'హెచ్‌సీయూ'లో భారీగా 'తిరంగార్యాలీ'



రాయదుర్గం: తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలను గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో అఖిల భారత విద్యార్థి పరిషత్ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం నిర్వహించారు. హెచ్‌సీయూ క్యాంపస్‌లో భారీ జాతీయపతాకంతో ర్యాలీలో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చరిత్రలో తెలంగాణ సంస్కృతి, ప్రజల త్యాగాలు, పోరాటం ఎంతో ఉందని నాయకులు గుర్తు చేశారు.

మార్కెట్ బిజీ..బిజీ...

శేరిలింగంపల్లి: మార్కెట్లలో వినాయకచవితి సందడి నెలకొంది. శేరిలింగంపలిలోని నల్లగండ్ల మార్కెట్, తారానగర్ మార్కెట్‌లో ఆదివారం ఉదయం నుంచి నెలకొంది. పెద్ద ఎత్తున పలువురు మార్కెట్లకు ఉదయం నుంచి సాయంత్రం వరకు వచ్చి వినాయక చవితి పూజా సామాగ్రి కొనుగోలు చేయడంపై దృష్టి సారించారు. పూలు, పండ్లు, అరటిఆకులు, మామిడిఆకులు, మండపాల డెకరేషన్ సామాగ్రి వంటివి కూడా కొనుగోలు చేసేందుకు అందరూ ఆసక్తి కనబర్చారు.



'గణేష్' నిమజ్జనానికి కోనేర్లు సిద్ధం

- నేటి నుంచి వినాయక చవితి ఉత్సవాలు
- చెరువుల వద్ద ఉండే కోనేర్లలో నిమజ్జనానికి ఏర్పాట్లు
- 2,5,7,9,11వ రోజుల్లోనే అత్యధిక నిమజ్జనాలు
- శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలో నిమజ్జన ఏర్పాట్ల పరిస్థితి



రాయదుర్గంలో గణేష్ నిమజ్జన కోనేరును సిద్ధం చేస్తున్న దృశ్యం

గచ్చిబౌలి: వినాయకచతుర్థి పర్వదినాన్ని పురస్కరించుకొని గణేష్ విగ్రహాల ప్రతిష్టాపనకు భారీగా ఏర్పాట్లు ఒకవైపు, నిమజ్జనానికి గణేష్ నిమజ్జన కోనేర్లను సైతం అధికారయంత్రాంగం సిద్ధం చేసింది. వినాయక ఉత్సవ కమిటీలు వినాయక మండపాల నిర్మాణం, విగ్రహప్రతిష్ఠాపన, పూజలపై దృష్టి కేంద్రీకరించగా, అధికార యంత్రాంగం ప్రశాంతంగా పూజలు, నిమజ్జనాలు జరిగేలా ప్రత్యేక ఏర్పాట్ల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించడంపై దృష్టి కేంద్రీకరించారు. ప్రతి కోనేరు వద్ద కల్పించాల్సిన సౌకర్యాలపై జీహెచ్‌ఎంసీ అధికారులు పరిశీలించి అందుకు తగ్గ ఏర్పాట్లు చేయడంపై దృష్టి పెట్టారు. శేరిలింగంపల్లి జంట సర్కిళ్ళ పరిధిలోని గణేష్ నిమజ్జన కోనేర్ల వద్ద అన్ని రకాల సౌకర్యాల పై పర్యవేక్షణకు అధికారులను ప్రత్యేకంగా నియమించారు. వారి పర్యవేక్షణలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేయడం ఇప్పటికే చేశారు.

సిద్ధం చేసిన కోనేర్లు...

- శేరిలింగంపల్లి జంట సర్కిళ్ళ పరిధిలో మాదాపూర్‌లోని దుర్గంచెరువు, రాయదుర్గంలోని మల్కం చెరువు, నల్లగండ్లలోని నల్లగండ్ల చెరువు, చందానగర్‌లోని గంగారం చెరువు, మియాపూర్‌లోని కాయిదమ్మకుంట వద్ద నిర్మాణం చేసిన గణేష్ నిమజ్జన కోనేర్లలో గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేయడానికి ఏర్పాట్లు చేశారు.
- ఈ కోనేర్లలో ఇప్పటికే పాత నీటిని, వ్యర్థాలను పూర్తిగా తొలగించి, శుభ్రం చేసి, కొత్త నీటితో నింపారు.
- ప్రతి కోనేరు వద్ద ప్రతియేటా ఏర్పాటు చేసేలా స్ట్రీట్ లైట్లు, ఫోకస్ లైట్లు, క్రేన్లు, ఇతర సౌకర్యాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.
- అంతేకాకుండా తాత్కాలిక మరుగుదొడ్లు, తాగడానికి మంచినీటి సౌకర్యం, కొంత మంది కూర్చోవడానికి ఏర్పాట్లు కూడా చేస్తున్నారు.
- ప్రతి కోనేరు వద్ద అధికారులు, ఉద్యోగులు, సిబ్బందిని కూడా సిద్ధం చేశారు. అంతేకాకుండా కోనేర్లలో నిమజ్జనం చేసిన విగ్రహాలు, పూలు, వంటివాటిని ఎప్పటికప్పుడు తొలగించేందుకు కూడా సిబ్బంది సిద్ధం ఉంచేలా ఏర్పాట్లు చేశారు. ఇలా తొలగించిన వ్యర్థాలను ట్రాక్టర్లు, ఇతర భారీ వాహనాల ద్వారా చెత్త పాయింట్ల వద్దకు తరలించేందుకు కూడా ఏర్పాట్లు చేశారు.

ఇప్పటికే సమన్వయ, పీస్ కమిటీ సమావేశాల నిర్వహణ...

- కోనేర్ల వద్ద అన్ని రకాల సౌకర్యాల కల్పన కోసం ఇప్పటికే అధికార యంత్రాంగం ముఖ్యంగా సైబరాబాద్ పోలీసులు, జీహెచ్‌ఎంసీ అధికారులు పర్యటించి, పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.
- ఇప్పటికే సైబరాబాద్ కమిషనరేట్‌లో జీహెచ్‌ఎంసీ, జలమండలి, టీఎస్ఎస్‌పీడీసీఎల్, అగ్నిమాపక విభాగం, నీటిపారుదల, రోడ్లు,భవనాల శాఖ, వైద్య, ఆరోగ్య, రెవిన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్‌శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని సీపీ స్టీఫెన్ రవీంద్ర నిర్వహించారు. అంతేకాకుండా గచ్చిబౌలి, రాయదుర్గం, మియాపూర్, మాదాపూర్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని కోనేర్లను ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు భద్రతా ఏర్పాట్ల నిర్వహణపై పరిశీలన చేశారు.
- ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇప్పటికే పీస్ కమిటీ సమావేశాలు నిర్వహించి ప్రశాంతంగా నిమజ్జనాలు, ఉత్సవాలను జరిపేలా చర్చించి పలు సూచనలను పోలీసులు చేశారు.
- జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్లు రజనీకాంత్‌రెడ్డి, వంశీకృష్ణ, ఇంజనీరింగ్ అధికారులు పర్యటించి కోనేర్ల వద్ద నిమజ్జనానికి తీసుకోవాల్సిన చర్యలపై పరిశీలన జరిపారు.